సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



రక్తదాహం..!

మనిషి జీవించడానికి ప్రధానమైనది రక్తం. ఇది సరిపడిన మోతాదులో ఉంటే ఆరోగ్యంగా జీవిస్తాడు. లేదంటే అనారోగ్యం బారిన పడతాడు.

- 8లో



వరద బాధితులకు ఆర్థిక సాయం

విజయనగరం ఫోర్ట్: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి చెందిన 30 మంది రెగ్యులర్ ఉద్యోగుల ఒకరోజు జీతం రూ.1.45.730ల చెక్కును వర్సిటీ వీసీ కట్టమణి కలెక్టర్ అంబేడ్కర్‌కు మంగళవారం అందజేశారు.

గెస్ట్‌ఫ్యాకల్టీకి ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ సబ్జెక్టును గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపాదికన బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఏ ఇంగ్లీష్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారు ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కళాశాల కార్యాలయానికి చేరేలా దరఖాస్తులు సమర్పించాలి. 13వ తేదీన ఉదయం 11 గంటలకు కళాశాలలో జరనున్న డెమో క్లాసుకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ చెప్పారు.

న్యూస్‌రీల్

17న పాలకొండలో మెగా జాబ్ మేళా

పార్వతీపురం: పాలకొండలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 17న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పది, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంఎస్సీ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ మెగా జాబ్‌మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, 1,050 పోస్టులు ఆయా కంపెనీల్లో భర్తీ చేయనున్నారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో విధిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఆ రోజున ఉదయం 9 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6301275511, 7993795796 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గుంప ఆలయాన్ని తాకిన నది ప్రవాహం



గుంప సోమేశ్వర ఆలయం వద్దకు చేరిన వరద నీరు

కొమరాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయగుండం ప్రభావంతో ఒడిశాలో విస్తారంగా వర్షాలు కురవడంతో నాగావళి నది నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన ఆలయాల్లో గుంపలోని సోమేశ్వర ఆలయాన్ని నది వరద నీరు తాకడంతో భక్తులతో పాటు అర్చకులు ఇబ్బందులు పడ్డారు. ఎంతో పేరుగాంచిన ఈ దేవాలయాన్ని పాలకులు పట్టించకోవడం లేదని మండిపడుతున్నారు నాగావళి, జంఝావతి నదుల సంగమంలో ఉన్న ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

పెరిగిన తోటపల్లి నీటిప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు పరిస్థితి

గరుగుబిల్లి: అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు, ఒడిశాలో కురిసిన వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం మరింత పెరిగింది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద సోమవారం సాయంత్రానికి 3,710 క్యూసెక్కులున్న నీటి ప్రవాహం మంగళవారం సాయంత్రానికి 4,824 క్యూసెక్కులకు చేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేసి 9,056 క్యూసెక్కుల వరద నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువలద్వారా 490 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రస్తుతం నదిలో సాధారణ నీటిమట్టం 105 మీటర్లకుగాను 104.02 మీటర్లలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 1.909 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టువద్ద నీటిపరిస్థితిని నీటిపారుదలశాఖ డీఈఈ టి.రఘునాథ నాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిశోర్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో చేపల వేటకు ఎవరూ వెళ్ళవద్దని హెచ్చరికలు జారీచేశారు. ఇదిలా ఉండగా నాగావళినది తీర పరీవాహక ప్రాంత ప్రజలు నదివైపు వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీచేశారు.

కళ్లికోట పరిసరాల్లో గజరాజుల గుంపు

కొమరాడ: నాగావళి నది ఆవైపు ఉన్న ఏడు ఏనుగుల గుంపు మంగళవారం కళ్లికోట, దుగ్గి తదితర గ్రామాల పరిసరాల్లో సంచరిస్తున్నాయి. ఆర్తాం, గుణానుపురం, దుగ్గి, కళ్లికోట తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమగ్నం చేసే వారంతా అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి బాణసంచా శబ్దాలు చేయకుండా ఏనుగుల గుంపు సమాచారం తెలుసుకుని జాగ్రతగా నిమజ్జనం చేసుకోవాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. అలాగే ఆర్తాం నుంచి కళ్లికోట రహదారిపై వచ్చే ప్రజలు రాత్రి పూట ఒంటరిగా వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు జాగ్రతలు పాటించాలని అటవీశాఖ సిబ్బంది కోరుతున్నారు.



దీనంగా ఉద్యాన పంటలు

- 134 ఎకరాల్లో పండ్ల తోటలు, 24 ఎకరాల్లో పంటలకు నష్టం
- పలుచోట్ల దెబ్బతిన్న రహదారులు, గృహాలు
- ప్రాథమికంగా నిర్ధారించిన అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం:

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో కురిసిన వర్షాలకు 134 ఎకరాల్లో పండ్ల తోటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. మరో 24 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ప్రధానంగా పార్వతీపురం డివిజన్ పరిధిలోని మక్కువ, చెముడు ప్రాంతాల్లో అరటి తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. పాలకొండలో 2, పార్వతీపురం మండలంలో 3, జియ్యమ్మవలస ప్రాంతంలో ఒకటి చొప్పున ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు నివేదిక ఇచ్చారు. ఇళ్లకు సంబంధించి మొత్తం నష్టం రూ.1,37,000గా అంచనా వేశారు. తంపటాపల్లిలో 3, పాలకొండ ప్రాంతంలో నాలుగు పశువులు శాలలు.. అన్నవరంలో నాలుగు ప్రహరీలు దెబ్బతిన్నాయి. పాలకొండ మండలంలోని ఎల్.ఎల్.పురంలో ఒక పునరావాస శిబిరం ఏర్పాటు చేయగా..ఇద్దరికి పునరావాసం కల్పించారు. పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలో 40 వరకు ఆహార పొట్లాలు, తాగునీరు సరఫరా చేసినట్లు అధికారులు చెబుతు న్నారు. వర్షప్రభావంతో పలు చోట్ల రహదారులు దెబ్బతినగా..ప్రధానంగా భామిని మండలంలో 10 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారి పాడై రూ.80 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

హోం మంత్రి సమీక్ష..

ఇటీవల సంభవించిన భారీ వర్షాలను ఎదుర్కోవడానికి జిల్లాలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖపట్నం కలెక్టరేట్ నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇటీవల కురిసిన వర్షాలు, జిల్లాలో జరిగిన నష్టాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ క్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఒక మేజర్ నీటి పారుదల ప్రాజెక్టు, నాలుగు మీడియం ప్రాజెక్టులు ఉన్నాయని.. వాటి సామర్థ్యానికి లోపల నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయని..వాటి మూలంగా నీటి ప్రవాహం పెరిగే అవకాశమున్నట్లు చెప్పారు. ముందు జాగ్రత్తగా నదీపరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. వర్షాలకు 134 ఎకరాల్లో పండ్ల తోటలు, 24 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. మారుమూల, గిరిశిఖర గ్రామాలలో గల గర్భిణులను గర్భిణీ వసతి గృహాలకు తరలించినట్లు వివరించారు. రెండు రాష్ట్ర రహదారులు, కూనేరు-రామభద్రపురం రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయని..వాటికి వెంటనే మరమ్మతులు నిర్వహించవలసి ఉందని చెప్పారు. ప్రభుత్వానికి అంచనాలతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని సాలూరులో సిద్ధంగా ఉంచామన్నారు.

పొంగుతున్న గెడ్డలు

ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి మాట్లాడుతూ పాచిపెంట, సాలూరు, కొమరాడ మండలాల్లో ఎగువ కురిసిన వర్షాలకు గెడ్డలు ఆకస్మికంగా పొంగుతున్నాయని..ఇటీవల పాచిపెంట మండలంలో హర్యానా రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గెడ్డలో కొట్టుకుపోయి చనిపోయారని తెలిపారు. ఇటువంటి సంఘటనలను నివారించడానికి గెడ్డలపై గల కల్వర్టుల ఎత్తును పెంచాలని అభిప్రాయ పడ్డారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా పోలీస్‌శాఖ నుంచి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు.

చిత్తయిన పత్తి రైతు

- వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



ముచ్చర్ల వలసలో తుఫాన్ కారణంగా నేలకొరిగిన మొక్కజొన్న



ఎదుగుదల లేకుండా నీరు పట్టిన పత్తి చేను

సాలూరు రూరల్: ఇటీవల వారం రోజులుగా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు సాలూరు మండలంలోని పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట పూత రాలిపోవడంతో తొలి దశ పంట వర్షార్పణంఅయిపోయినట్లేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పత్తి పంట నీరుపట్టి ఎదుగుదల లేకుండా పోవడంతో ఆశించిన పంట వచ్చే అవకాశంలేదని రైతులు చెబుతున్నారు. అలాగే ఈ వర్షాలకు మొక్కజొన్న చేలు నేలకొరిగిపోయాయి. మామిడిపల్లి, ముచ్చర్లవలస, కూర్మరాజుపేటతో పాటు పలు గ్రామాలలో పత్తి, మొక్కజొన్న చేలు దెబ్బతిన్నాయి. ఇలాగే మరికొన్ని రోజులు వర్షాలు పడినట్లయితే పూర్తిగా పత్తి, మొక్కజొన్నతో పాటు వరిచేలు కూడా ముంపు బారిన పడి దెబ్బతినే పరిస్థితి తలెత్తుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాలను ఇంతవరకు పరిశీలించడానికి అధికారులు గ్రామాలకు రాకపోవడం విచారకరమని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పంటలు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ ఈ ప్రభావం పంట చివరి దశలో రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం పంటనష్టాలను అంచనా వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు



2 ఎకరాల్లో పత్తిపంట వేశాను. ఇప్పటికే రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. తుఫాన్ కారణంగా కనీసం పెట్టుబడి డబ్బులు కూడా వస్తాయో రావోనని ఆందోళనగా ఉంది. మరోవైపు గతంలో రైతు భరోసా రైతులకు కొంత పెట్టుబడులకు ఉపయోగపడేది. ప్రస్తుతం అదికూడా అందలేదు. పంట నష్టాలను పరిశీలించే పరిస్థితులు కనిపించడం లేదు. ఇంతవరకు ఒక్క అధికారి కూడా రైతుల పొలాలు ఎలా ఉన్నాయో చూసేందుకు రాలేదు.

మాలి రాజు, ముచ్చర్లవలస, అన్నం రాజువలస, సాలూరు మండలం

రైతులను నిర్లక్ష్యం చేస్తే ఎలా?



ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తే ఎలా. మా పంటలకు జరిగిన నష్టాలు ఇప్పుడు కనిపించకపోవచ్చు. పంట చివరి దశలో ఎకరాకు రావాల్సిన దిగుబడి రాదు. అప్పుడు రైతు ఎంత నష్టపోయాడో తెలుస్తుంది. ప్రస్తుతం పాక్షికంగా పంటలు దెబ్బతిన్నట్లు కనిపిస్తున్నాయి. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నాం. రెండు ఎకరాల్లో పత్తి పంట వేశాను. ప్రస్తుతం వర్షాలకు చేను ఎదుగుదల లేకుండా ఉంది.

పాముల లక్ష్మి, ముచ్చర్లవలస అన్నం రాజువలస, సాలూరు మండలం

ఇలాగే వర్షాలు పడితే పూర్తిగా నష్టపోతాం

తుఫాన్ ఇలాగే మరికొన్ని రోజులు కొనసాగితే కాస్తా పంట చేతికి వస్తుందనుకున్న ఆశ వదులుకోవాల్సిందే. మా గోడు ఎవరు పట్టించుకుంటారో అర్థం కావడం లేదు. రైతులను ఆదుకునే పరిస్థితి ఎంతవరకు ఈ ప్రభుత్వం చేస్తుందో ఎదురు చూడాలి. చేలు పడిపోతేనో లేక నీట మునిగితేనో పంట నష్టపోయినట్లు అధికారులు లెక్కలు వేస్తారు. అలా కాకుండా వాస్తవంగా రైతు ప్రతి ఏటా పంట పండిస్తాడో తెలుసుకుని తుఫాన్ కారణంగా ఎంత తేడా వచ్చిందో అంచనా వేసి రైతుకు నష్టాన్ని పరిహారంగా ఇవ్వాలి. అధికారులు తూతూ మంత్రంగా పరిశీలన చేస్తే అది ప్రభుతం నిర్లక్ష్యమే అవుతుంది.

జరజాపు సత్యవతి, మామిడిపల్లి, సాలూరు మండలం

పది రోజుల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలి

సీతంపేట: భామిని ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం పదిరోజుల్లో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. 'విద్యార్థుల ఇంటిబాట' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలోనే నాలుగు గదులు కేటాయించి తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

గుమ్మగెడ్డ రిజర్వాయర్ పరిశీలన

సీతంపేట: 'గుమ్మగెడ్డ జలాశయానికి గండి' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంపీడీవో కె.గీతాంజలి, ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది రిజర్వాయర్‌ను పరిశీలించారు. జలాశయానికి పడిన గండిని పరిశీలిస్తూ ఇక్కడ గేటు లేకపోవడం వల్ల నీరు వృథాగా పోతుందని ఇరిగేషన్ డీఈ నారాయణరావు అన్నారు. రానున్న వేసవిలో గేటు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ప్రస్తుతానికి గండి వల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని అధికారులు తెలిపారు.



రిజర్వాయర్‌కు పడిన గండిని పరిశీలిస్తున్న ఎంపీడీవో గీతాంజలి తదితరులు

వైద్యుల పోరుబాట



దోనుబాయి పీహెచ్‌సీలో నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరైన వైద్యులు

- జీవో నంబరు 85కు నిరసనగా దశలవారీ ఆందోళన
- పీహెచ్‌సీల్లో నల్లబ్యాడ్జీలతో విధులు

సాక్షి, పార్వతీపురం మన్యం/ మక్కువ/పాలకొండ రూరల్:

పీహెచ్‌సీ వైద్యులు పోరుబాట పట్టారు. జీవో నంబరు 85కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల సంఘం ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ప్రభుత్వం దిగిరాకుంటే ఈ నెల 16 నుంచి నిరవధిక నిరాహార దీక్షలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

ప్రధానంగా పీజీ వైద్యవిద్యలో ఇన్‌సర్వీస్ కోటా కుదిస్తూ తీసుకొచ్చిన జీవో నంబరు 85ను కొన్నాళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. ఇది అమలు చేయడం వల్ల తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోతోందని..అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమని వాపోతున్నారు. జిల్లాలో 37 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీలు ఉన్నాయి. వాటిలో సుమారు 79 మంది వైద్యులు పనిచేస్తున్నారు. ఈ జీవో వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. దీన్ని రద్దు చేయాలని రెండు నెలలుగా అధికారులు, శాసనసభ్యులకు అర్జీలు సమర్పిస్తున్నారు. ఇప్పటివరకూ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళనకు దిగారు.

16వ తేదీ వరకు నిరసనలకు పిలుపు

- ఈ నెల 10న నల్లబ్యాడ్జీలతో పీహెచ్‌సీల్లో విధులకు హాజరు
- 11, 12 తేదీల్లో సేవల్లో అంతరాయం లేకుండా నిరసన
- ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకుంటే 13వ తేదీన అత్యవసర సేవలను మినహాయించి..అన్ని రిపోర్టింగులు, వీసీ, టీసీలు వంటి అధికారిక కార్యక్రమాల నిలిపివేత.
- 14న అత్యవసర సేవలకే పరిమితం.
- 15న చలో విజయవాడ ర్యాలీ (డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం)
- 16న నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభం

విపత్కర పరిస్థితుల్లోనూ సేవలు



వైద్యుల్లో చాలామంది కోవిడ్–19 వంటి విపత్కర పరిస్థితుల్లోనూ జీవితాలను ప్రమాదంలో పెట్టి వైద్యసేవలు అందించారు. ఇప్పుడు జీవో 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయం. ఇది ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుంది.

– డాక్టర్ కిరణ్‌కుమార్, శంబర పీహెచ్‌సీ

విజ్ఞప్తులిచ్చినా పట్టించుకోలేదు



ఇంతకాలం నిరసనలు చేసి, అర్జీలిచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగాం. నీట్ పీజీ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ తర్వాత వైద్యులు ఇలానే కొనసాగడం అసాధ్యం. మరో దారిలేకే ఆందోళన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– డాక్టర్ నిఖిల, మక్కువ పీహెచ్‌సీ

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



జీవో 85ను తక్షణం రద్దు చేసి, ప్రభుత్వం వైద్యుల సమస్యలను పరిష్కరించాలి. లేకుంటే రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసనలు కొనసాగిస్తాం. ఈ జీవో వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలకు విఘాతం ఏర్పడుతుంది.

– డాక్టర్ హరికృష్ణ, మక్కువ పీహెచ్‌సీ

సర్వీసు కోటా రద్దయిపోతుంది



జీవో నంబర్ 85 ప్రాప్తికి భవిష్యత్తు చదువుల కోసం గ్రామీణ, పట్టణ పరిధిలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు చేసిన సేవలు వృథాగా పోతాయి. గతంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు పల్లె ప్రజలకు సేవలు అందిస్తున్నాం. ఏజెన్సీల్లో విధులు చేపట్టేందుకు ఎటువంటి అదనపు అలవెన్సులు తీసుకోవడం లేదు. వృత్తిపరంగా నైపుణ్యం సాధించే క్రమంలో పీజీలు చేసే అవకాశాలు 85 జీఓ అమలు ద్వారా తగ్గిపోతాయి. ఇదివరకే ఈ అంశమై మా అభిప్రాయం ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి వివిధ రూపాల్లో తీసుకువెళ్లాం. సర్వీసు కోటా రద్దయిపోతే పీజీలో చేరేందుకు ఉన్న అవకాశాలు పూర్తిగా సన్నగిల్లిపోతాయి. కేవలం ఐదు విభాగాలు మినహా మిగిలిన పీజీ కోర్సుల్లో చేరే అవకాశం కూడా ఉండదు.

ఎస్.రవికుమార్, వైద్యాధికారి, ఎం.సింగుపురం పీహెచ్‌సీ

రెండేళ్లుగా ఏజెన్సీలో సేవలు



ఉన్నత చదువులను దృష్టిలో పెట్టుకుని శాఖాపరమైన యంత్రాంగం సూచనలతో రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది వైద్యులు ఏపీ పీహెచ్‌సీడీపీ పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. అర్బన్ పరిధిలో మూడు, ఏజెన్సీలో రెండేళ్ల కాలపరిమితితో సేవలు అందిస్తున్నాం. జీవో 85 రద్దు చేయాలని రెండు నెలలుగా విన్నవిస్తున్నాం. ఈ జీవో అమలు కారణంగా సర్వీసు కోల్పోవడంతో పాటు పీజీలో చేరే స్థానాల సంఖ్య తగ్గిపోతుంది. పైగా జీవో ప్రాప్తికి 30 శాతం ఉన్న పీజీ కోటా 15 శాతానికి తగ్గిపోనుంది. దీనికి తోడు ఆర్థో, జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్ మినహా మిగిలిన విభాగాలకు చెందిన పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుకునే అవకాశం కూడా లేకపోవడం అన్యాయం.

జి.గిరిషా, వైద్యాధికారి, ఎం.ఎస్.పురం పీహెచ్‌సీ

ఆపండి

- నేను చెప్పేవరకు అభివృద్ధి పనులు చేయవద్దు
- ఐటీడీఏ అధికారులకు మంత్రి సంధ్యారాణి ఆదేశాలు?



మధ్యలో నిలిచిపోయిన బూర్జ నుంచి పనసవలస రోడ్డు

సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గంలో గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి రహదారులు, కాలువల పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం హయాంలో గిరిశిఖర గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజన గ్రామాలకు కూడా కోట్ల రూపాయాల నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంబించారు. అయితే ఆ పనులన్నీ మధ్యలో ఉండగానే ఎన్నికల కోడ్ రావడం తరువాత ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఈ రోజువరకు ఎక్కడా కూడా ఒక్క రాయిపిక్క, ఒక్క పార ఇసుక కానీ వేయలేదు. దీనికి కారణాలు లోతుగా విశ్లేషిస్తే..కొత్తగా ఎన్నికైన మంత్రి సంధ్యారాణి పనులు ఆపేయమన్నారని, తాను చెప్పేంత వరకు ఎక్కడా ప్రారంబించకూడదన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. నిజంగానే మంత్రి అలా చెప్పారా? లేక ఆ సాకుతో ఐటీడీఏ అధికారులు తప్పించుకుంటున్నారా? అన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఆరు నెలలుగా ఐటీడీఏ శాఖలో ఏ పనీ జరగడం లేదు. అప్పట్లో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు తీసుకువచ్చిన నిధులతో జరుగుతున్న పనులు కూడా మధ్యలోనే నిలిచిపోయాయి. దీనికి ఉదాహరణగా బూర్జ గ్రామం నుంచి పనసవలసకు బీటీ రోడ్డు, అన్నంరాజువలస పంచాయతీలో వేయాల్సిన బీటీ రోడ్లు గ్రావెల్‌తోనే నిలిచిపోయాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నా ఐటీడీఏ నిర్లక్ష్యం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర రూ.1,200 కోట్లు మంజూరు చేయించి చాలావరకు గిరిశిఖర గ్రామాలకు రోడ్లు పూర్తిచేశారు. అయితే ఇంకా నిర్మాణ దశలో ఉన్న పనులను నిలిపివేయాలని మంత్రి సంధ్యారాణి ఆదేశాలు జారీ చేశారన్న ప్రచారంలో నిజానిజాలు అధికారులు చెబితే కానీ తెలియదు. అసలే అధికార పార్టీ..అందులోనూ మంత్రి స్థాయి నాయకుల ఆదేశాలపై బయటకు కక్కలేక మింగలేక అధికారులు ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధి కోసం పాటుపడాల్సిన గిరిజన మంత్రి పనులు ఆపాలని అధికారులను ఆదేశించడం విచారకరం.



అర్ధాంతరంగా నిలిచిపోయిన అన్నం రాజువలస రోడ్డు పనులు

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

మధ్యలో నిలిచిపోయిన పనులు పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లు సుముఖంగా లేరు. బిల్లులు మంజూరవుతాయో? లేదోనని భయపడుతున్నారు. పనులు వీలైనంత త్వరగా మొదలు పెడతాం. పాత కాంట్రాక్టర్లు రాకపోతే కొత్త వారితో చేయిస్తాం.

మణిరాజు, డీఈ, పార్వతీపురం ఐటీడీఏ

క్లుప్తంగా

తుపాను ప్రభావంతో 10 మేకల మృతి



చనిపోయిన మేకలు

బొండపల్లి: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు బొండపల్లి మండలంలోని కెరటాం గ్రామంలో సోమవారం రాత్రి 10 మేకలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన నీలాతి అప్పన్న గ్రామం సమీపంలోకి మేకల మందను తోలుకుని వెళ్లి అక్కడికి సమీపంలోనే ఆరుబయట మందను ఉంచాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్షం కురవడంతో ఆ వర్షానికి 10 మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. ఈ విషయాన్ని మంగళవారం గ్రామంలోకి వచ్చి వెటర్నరీ వైద్య సిబ్బందికి తెలియచేయడంతో బొండపల్లి పశు వైద్యాధికారి ఎం.కిరణ్ కుమార్ చనిపోయిన మేకలను పరిశీలించారు. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ డి.రాజేశ్వర రావు గ్రామానికి వచ్చి చనిపోయిన మేకలను పరిశీలించి నివేదికను తయారు చేసి ఇవ్వాలని వెటర్నరీ వైద్య సిబ్బందికి సూచించారు. చనిపోయిన మేకల విలువ రూ.లక్షా యాభై వేలకు పైగానే ఉంటుందని తీవ్రంగా నష్టపోయిన తనను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

12న జాబ్‌మేళా

విజయనగరం ఫోర్ట్: ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ప్రభుత్వ ఐటీఐ కంచరపాలెం, విశాఖపట్నంలో ఈనెల 12 వతేదీన ఉదయం 9 గంటల నుంచి ఆశోక్ లేలాండ్ కంపెనీ జాబ్ ఫేర్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్ టీవీ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, మోటార్ మోకానిక్, డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లలో ఐటీఐ పాస్ అయిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థి వయోపరిమితి 26 సంవత్సరాలు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులు దుబాయిలోని యుఏఈలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాస్‌పోర్టు ఉన్న వారికి, 2 ఏళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఫోన్ 94401097068 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

విజయనగరం ఫోర్ట్: విజయనగరం మండలంలోని కొండకరకాం జంక్షన్ వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం చోరీకి గురైంది. రెండు నెలల వ్యవధిలో విజయనగరం మండల పరిధిలో 8 ట్రాన్సఫార్మర్లు చోరీకి గురికావడంతో విద్యుత్ శాఖ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్ గేట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డయల్ 100కు వచ్చిన ఫోన్ ద్వారా అందుకున్న సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. సమీపంలో విచారణ చేయగా ఎటువంటి సమాచారం లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వకేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

వంశధారకు వరద

- అప్రమత్తమైన అధికారులు



ఓపెన్ హెడ్ చానల్ సైడ్ వ్యూయర్ వద్ద వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్ శేఖరం, వీఆర్‌ఓలు

భామిని: వంశధార నది ఎగువ భాగమైన ఒడిశాలో వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం నదిలోకి వరద నీటి తాకిడి పెరిగింది. భామిని మండలంలో వర్షాల తాకిడి తగ్గినప్పటికీ నదిలో వరద పెరగడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నదిలోకి సుమారు 12 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు తహసీల్దార్ నిమ్మల శేఖరం ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం కాట్రగడ–బి ఓపెన్ హెడ్ చానెల్ సైడ్ వ్యూయర్‌లో వరదనీటి ప్రవాహాన్ని పర్యవేక్షించారు. ఇప్పటికే సైడ్ వ్యూయర్‌లో తీసిన ఇసుక మేటలు వరద నీటిలో కొట్టుకుపోయిన విషయాన్ని వీఆర్‌ఓలు తహసీల్దార్‌కు తెలియజేశారు. తీర గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని వీఆర్‌ఓల ద్వారా తహసీల్దార్ దండోరా వేయించారు. వంశధార డీఈఈ భవానీ శంకర్ ఆధ్వర్యంలో ఏఈఈలు జగదీష్ బాబు, సునీతా కిరణ్‌లు ఓపెన్ హెడ్ చానల్‌లోకి వరదనీటి ప్రవాహాన్ని పర్యవేక్షించారు.

రక్తదాహం..!

- రక్తం ఇవ్వకుండా ఎగ్గొడుతున్న ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకులు



ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో భద్రపరిచిన బ్లడ్ ప్యాకెట్స్



రక్తం ఇస్తున్న దాతలు

ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లు ఇచ్చిన రక్తం వివరాలు

బ్లడ్ బ్యాంక్	సేకరించింది (యూనిట్లు)	ఇవ్వాల్సింది (యూనిట్లు)	ఇచ్చింది (యూనిట్లు)
రెడ్‌క్రాస్ సొసైటీ	367	110	15
ఎస్‌వీఎస్	108	32	10
న్యూలైఫ్	31	9	10
రోటరీ	34	10	13
బొబ్బిలి	12	4	0
విజయ	00	00	25

విజయనగరం ఫోర్ట్: మనిషి జీవించడానికి ప్రధానమైనది రక్తం. ఇది సరిపడిన మోతాదులో ఉంటే ఆరోగ్యంగా జీవిస్తాడు. లేదంటే అనారోగ్యం బారిన పడతాడు. శరీరంలో రక్తం గణనీయంగా తగ్గిపోతే చనిపోతారు. రక్తహీనత ఉన్న రోగులకు రక్తం సకాలంలో ఎక్కించగలిగితే ప్రాణాలు నిలుస్తాయి. ముఖ్యంగా పేదరోగులు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతారు. వారికి రక్తం అవసరమైనప్పుడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లయితే ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ నుంచి ఉచితంగా రక్తం అందిస్తారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ నుంచి రక్తం తెచ్చుకోవాలంటే టెస్టింగ్ చార్జీల కింద డబ్బులు కట్టాల్సిన పరిస్థితి. పేద వారికి ఇది తలకు మించి భారం అవుతుంది. కాబట్టి రోగులు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లకు రక్తం కోసం ఎక్కువగా వస్తారు. దీని వల్ల ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో రక్తం ఎక్కువగా వినియోగమవుతుంది.

30 శాతం ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు ఇవ్వాలి

రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తంలో ప్రైవేట్ బ్లడ్‌బ్యాంక్‌లు 30 శాతం రక్తాన్ని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు ఇవ్వాలి. కానీ ఇది జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదు. నిబంధన ప్రకారం రక్తదాన శిబిరం నిర్వహించిన రోజే 30 శాతం రక్తాన్ని ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు తెచ్చి ఇవ్వాలి. కానీ ఆ విధంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏప్రిల్ నుంచి జూలై వరకు 552 యూనిట్స్ సేకరణ

జిల్లాలోని ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరు నాటికి 552 యూనిట్ల రక్తాన్ని సేకరించాయి. 30 శాతం ప్రకారం ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు 166 యూనిట్ల రక్త్వం ఇవ్వాలి. అయితే 73 యూనిట్లు మాత్రమే ఇచ్చాయి. మిగిలిన 93 యూనిట్లు ఇవ్వలేదు.

జిల్లాలోని ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లు

జిల్లాలో మిమ్స్, ఎస్‌వీఎస్, విజయ, రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ బ్లడ్ బ్యాంకులు, బొబ్బిలి బ్లడ్ సెంటర్, న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్ ఉన్నాయి.

'సూర్యఘర్' సబ్సిడీ వినియోగించుకోవాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం సూర్య ఘర్ సబ్సిడీని వినియోగించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకునేలా విద్యుత్ శాఖ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సోలార్ యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తి అయిన విద్యుత్ మనం వాడుకోగా మిగిలిన విద్యుత్‌తో ఆదాయం వస్తుందన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు విద్యుత్ శాఖ కృషిచేయాలని ఆదేశించారు. రానున్న మూడు నెలల్లో 1000 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యం పూర్తిచేయాలని విద్యుత్, మునిసిపాలిటీ సంస్థలను ఆదేశించారు.

మోడల్ సోలార్ గ్రామాన్ని గుర్తించాలి

ఇంటిపై సోలార్ యూనిట్ పెట్టుకునేందుకు అవకాశం గల ఇళ్లను గుర్తించి సచివాలయ సిబ్బంది ద్వారా వారికి అవగాహన కల్పించి దరఖాస్తు చేయించాలన్నారు. గృహసముదాయాలు, ఆస్పత్రులు , దుకాణ సముదాయాల్లో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మోడల్ సోలార్ గ్రామం ఏర్పాటుకు అవకాశం గల గ్రామాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు.

45 రోజుల్లో సబ్సిడీ జమ

విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు పథకం వివరాలను తెలియజేశారు. వినియోగదారులు 10 కిలోవాట్ల వరకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, రూ.1300 ఫీజు చెల్లించిన పిదప మాత్రమే దరఖాస్తు ప్రాసెస్ అవుతుందని తెలిపారు. మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలో వాట్లకు రూ. 60వేలు, మూడు కిలోవాట్ల రూ.78వేలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని వివరించారు. యూనిట్ స్థాపించిన 45రోజులలో సబ్సిడీ వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమవుతుందని తెలిపారు. యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం పొందే అవకాశం కూడా ఉందని, పెట్టుబడి మొత్తం మూడు లేక నాలుగు సంవత్సరాలలో తిరిగి వచ్చేస్తుందని వివరించారు. సమావేశంలో పార్వతీపురం విద్యుత్ శాఖ ఈఈ కె.గోపాలరావు నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- డీఈవో ప్రేమ్‌కుమార్



ఉపాధ్యాయులతో సమీక్షలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

రామభద్రపురం: పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు రామభద్రపురంలోని ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని, రికార్డులు పరిశీలించారు. రెండు రోజుల ముందు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను ఇక్కడి పాఠశాలకు పంపించి విద్యార్థుల సామర్థ్యాలు ఎలా ఉన్నాయి? ఉపాధ్యాయుల బోధన తీరు ఎలా ఉంది? విద్యార్థులకు కనీస బేసిక్స్ ఉన్నాయా? లేదోనని పరిశీలించి నివేదికలు తయారు చేయించారు. ఆ నివేదికలను రామభద్రపురం పాఠశాల ఉపాధ్యాయులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో వెల్లడించారు. దాదాపు అన్ని తరగతుల్లోనూ ఆడ పిల్లల విద్యాసామర్థ్యం, హాజరు శాతం బాగుందని,మగ పిల్లల్లో కనీస సామర్థ్యాలు లేకపోవడంతో పాటు వారి హాజరు శాతం బాగా లేదని గుర్తించారు. మంగళవారం కూడా సుమారు 300 మంది విద్యార్థులు గైర్హాజరు కాండంతో ఇన్‌స్పెక్షన్ తేదీని మూడు రోజులు ముందు ప్రకటించినా పిల్లల హాజరు శాతం పెంచలేకపోయారని,హెచ్‌ఎం నుంచి ఉపాధ్యాయుల వరకు ఇన్‌స్పెక్షన్ అంటే గౌరవం లేదని అసంతృప్తి వెలిబుచ్చారు. పాఠశాలల తనిఖీ ముమ్మరం చేయాలని ఎంఈవోలు తిరుమలప్రసాద్, పెంటయ్యలను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కామేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గొడౌన్‌లో గోవులు

- దాడి చేసిన పోలీసులు
- ముగ్గురు నిందితులపై కేసు నమోదు
- రెండు బొలెరో వాహహనాలు సీజ్



తరలించేందుకు సిద్ధంగా ఉన్న గోవులను పరిశీలస్తున్న సీఐ షణ్ముఖ రావు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామ సమీపంలో గల గొడౌన్‌లో అక్రమంగా పశువులను బంధించారన్న విషయం తెలుసుకున్న సీఐ షణ్ముఖరావు సిబ్బందితో కలిసి వెళ్లి మంగళవారం దాడి చేశారు. ఒడిశా రాష్ట్రం, మానాపురం, అలమండల సంతల నుంచి వాహనాల్లో తీసుకుని వచ్చి ఈ గొడౌన్‌లో 108 గోవులను బంధించినట్లు గుర్తించారు. వాటిని ఇక్కడి నుంచి వేరే ప్రాంతాల్లోని కబేళాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుసుకున్నామని సీఐ షణ్ముఖరావు తెలిపారు. పశువులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న 2 బొలెరో వాహనాలను సీజ్ చేసి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి గోవులను స్వాధీనం చేసకున్నట్లు సీఐ చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బూశాయవలస విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం టి.జేమ్స్ ఇతర ఉపాధ్యాయులు

రామభద్రపురం: మండలంలోని బూశాయవలస ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 16 విభాగంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రామినాయుడు తెలిపారు. ఈ నెల 8వ తేదీన నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా జట్టు ఎంపికల్లో డి.సురేష్, బి.అంజలి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13,14,15 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను హెచ్‌ఎం టి.జేమ్స్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

మరుగుదొడ్లను పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రమణమూర్తి

భోగాపురం: మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లను వారంలో రెండు రోజులు పరిశీలించి ఫొటోలను ప్రభుత్వానికి సంబంధించిన యాప్‌లలో అప్లోడ్ చేయాలని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఎంఈఓ రమణమూర్తి సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు జీపీఎస్ ఆధారంగా ఎప్పుడు ఏ సమయంలో పాఠశాలల తనిఖీకి వస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో అధికారులు పాఠశాలలు తనిఖీకి వచ్చేటప్పుడు సమాచారం అందించేవారని ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. వారంలో రెండు రోజులు సచివాలయ వెల్ఫేర్ సిబ్బంది, మరో రెండు రోజులు స్కూల్ కమిటీ సభ్యులు, మిగిలిన రెండు రోజులు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మరుగుదొడ్లను పరిశీలించి ఫొటోలను ప్రభుత్వం సూచించిన యాప్‌లలో అప్లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ–2 బి.చంద్రమౌళి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గణనాథునికి నృత్య నీరాజనం



రామనారాయణంలో నృత్య నీరాజనం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని రామనారాయణం ప్రాంగణంలో శ్రీసూర్య అకాడమీ విద్యార్థులు నృత్య నీరాజనం సమర్పించారు. అకాడమీ ఫౌండర్ టివి.రామ్‌కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్యజ్యోతి బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులందరికీ ప్రశంసపత్రాలను, నాట్యగురువులకు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆడలిని మరింత అభివృద్ధి చేయాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని ఆడలి ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులకు సూచించారు. జిల్లా పర్యాటక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడలి మంచి పర్యాటక ప్రదేశమని, దానిని ఇంకా బాగా అభివృద్ధి చేయాలని కోరారు. అడలి పర్యాటక కేంద్రానికి వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్ స్థలం అభివృద్ధి చేయాలని, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి అడలి వ్యూ పాయింట్ బోర్డు ఏర్పాటు చేసి బ్రాండింగ్ చేయాలని సూచించారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

ప్రపంచ పర్యాటక దినోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి పర్యాటక దినోత్సవాన్ని దోహదం చేయాలని అభిప్రాయ పడ్డారు.

శంబర ప్రధాన వీధిని అభివృద్ధి చేయాలి

శంబర పోలమాంబ ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు గ్రామంలోని ప్రధానవీధి అభివృద్ధి చేయాలని కలెక్టర్ అన్నారు. ఉత్సవాలు బాగా నిర్వహించేందుకు అవసరమైతే వీధిలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి జీఏపీ. ప్రసూన మాట్లాడుతూ సీతంపేట మండలంలో బెనరాయ్ వాటర్ ఫాల్స్, పొల్ల వ్యూ పాయింట్, సున్నపుగెడ్డ వాటర్ ఫాల్స్ వద్ద పర్యాటక అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం

జిల్లాలోని ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, రహదారులు, భవనాలు, గిరిజన ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- వేగావతి పరీవాహక గ్రామాల్లో మాఫియా
- అడ్డుకున్నవారిపై దాడులకు యత్నం



వేగావతినదిలో ఇసుక లోడ్ చేస్తున్న ట్రాక్టర్లు



సుధాకర్

బొబ్బిలి రూరల్: మండలంలో ఇసుక అక్రమ రవాణా ఇష్టారాజ్యంగా జరుగుతోంది. వేగావతి నది పరీవాహక గ్రామాలైన కారాడ, అలజంగి, పారాది, పెంట వంటి గ్రామాల నుంచి ట్రాక్టర్లతో ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయినా అధికారగణం కనీసం నిఘా కూడా పెట్టలేకపోతోంది. అధికారపార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరుకాయలన్న అన్న చందంగా సాగుతోంది. ఇసుక రవాణా జరుగుతున్న ట్రాక్టర్లను ఆపుతున్న రెవెన్యూ సిబ్బందిపై మూకుమ్మడి దాడికి మాఫియా వ్యక్తులు యత్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన ఇసుక అక్రమరణాపై చర్యలు తీసుకోవాలని అధికారులకు చెబుతున్నప్పటికీ ఆచరణలోకి రావడంలేదు. అధికార పార్టీకి చెందిన చోటామోటా నాయకులే గ్రామాల్లో ఈ దందాకు పూనుకుంటున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. అయినా అధికార పార్టీ పెద్దలు వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్నది విమర్శ. వేగావతి నదినుంచి పట్టణానికి తీసుకువచ్చే ట్రాక్టర్ ఇసుకను రూ.3,500కు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ రాత్రి 7 గంటలనుంచి ప్రారంభమవుతున్న ఇసుక రవాణా తెల్లవారుజామున 4 గంటలవరకు నిరాటంకంగా సాగుతుందని ఆయా గ్రామాల్లో ఎవరిని అడిగినా చెబుతున్నారు. మరి అధికారులు పట్టుకుంటారా? అని ప్రశ్నిస్తే అధికారంలో ఉన్న వారిని ఎవరు పట్టుకుంటారంటూ పెదవి విరుస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం రెవెన్యూ అధికారులే కాకుండా పోలీసుశాఖ సైతం ఇసుక అక్రమరవాణాపై నిఘా ఉంచి పట్టుకుని కేసులు పెట్టవచ్చు. జరిమానా విధించవచ్చు. కానీ జిల్లాలో అలాంటివేమీ జరగడంలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటివరకు ఇసుక అక్రమరవాణా చేస్తూ దొరికిన ట్రాక్టర్లు, టిప్పర్లకు జరిమానా నామమాత్రంగా వేస్తున్నారే తప్ప ఇసుక అక్రమరవాణా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్న సందేశం ఇచ్చే సాహసాన్ని అధికారులు చేయలేకపోతున్నారు. దీనికి అధికార పార్టీ ద్వితీయశ్రేణి నాయకత్వమే ప్రధాన కారణమని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేగావతి నదిలో ఇసుకను ట్రాక్టర్లలో లోడ్‌వేస్తుండగా రెవెన్యూ అధికారులు దాడిచేసి అలజంగి గ్రామంలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.అధికారులు దాడిచేసేసమయంలో అన్ని ట్రాక్టర్లు వేగావతి నదిలో ఉండగా వారిని చూసి నదిలోనే ఇసుకను విడిచిపెట్టారు. దీంతో ఒక ఇసుకలోడుతో ఉన్న ట్రాక్టర్ 4 ఖాళీ ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సుమారు వంద మందికి పైగా తమపై దాడిచేసేందుకు ప్రయత్నించారని దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పంపించి వేశారని వీఆర్‌ఓ సుధాకర్ తెలిపారు.ఇలా దాడులకు పూనుకుంటే తామెలా ఇసుక ట్రాక్టర్లను పట్టుకోగలమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిరోజూ జరుగుతున్న ఈ తంతు అందరికీ తెలుసని, అయినా తప్పదని భయంభయంతోనే విధులు నిర్వహిస్తామని తెలిపారు.

లైంగికదాడి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష

- రూ.35 వేల జరిమానా

గంట్యాడ: లైంగికదాడికి పాల్పడిన ముద్దాయికి 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.35వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని కరకవలస గ్రామానికి చెందిన మద్దిల మురళి అదే గ్రామానికి చెందిన ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో 2018లో అప్పటి ఎస్సై నారాయణరావు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ డి.లక్ష్మణరావు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలరు. అనంతరం ఆయనకు బదిలీ కావడంతో విజయనగరం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన డి.రమేష్ కేసు దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసును ప్రాధాన్యత కేసుల జాబితాలోకి తీసుకుని ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేవిధంగా కోర్టు తీర్పు చెప్పింది. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రవీంద్రనాథ్ వాదనలు వినిపించారు. కేసులో త్వరితగతిన ముద్దాయికి శిక్షపడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

లింగ వివక్ష రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మస్తానయ్య, డీఈఓ పగడాలమ్మ

భామిని: పాఠశాలల్లో లింగ వివక్ష ఆధారంగా జరిగే హింసను అరికట్టేందుకు టీచర్లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసే విధానంపై సర్వ శిక్ష, సీమాట్, రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వి.ఆర్. మస్తానయ్య పలు సూచనలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఎంల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు,మహిళా పోలీస్‌లు,పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేయాలని హితవు పలికారు. లింగ వివక్ష, హింస లేకుండా చూడాలని కోరారు. సామాజిక చైతన్యం కల్పించి వెనుకబడిన భామిని మండలాన్ని ఆశావహ బాటలో నడపాలని పిలుపునిచ్చారు. డీఈఓ పగడాలమ్మ, సీమాట్ ప్రొఫెసర్ కె.శారద, కైవల్య ఫౌండేషన్ ప్రతినిధి నాగమ్మ, ఏఎంఓ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈఓ వి.కృష్ణమూర్తి, ఎంఈఓలు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200